క్లుప్తంగా

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మద్దూరు: మండలంలోని ఓ తాండా (సాపన్‌చెరువు) చెందిన మైనర్‌ను ఓ వివాహితుడు ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకుంటుండగా జిల్లా బాలల రక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దౌల్తాబాద్ మండలం పోల్కంపల్లి తాండాకు చెందిన 40 ఏళ్ల వివాహితుడికి పిల్లలు కాకపోవడంతో బాలికను పెళ్లి చేసుకోవడానికి యతి్నంచాడు. ఈ క్రమంలో కొందరు 1098 హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేయగా బాలల రక్షణ విభాగం అధికారిని కరిష్మా, సూపర్‌వైజర్ లక్ష్మణ్ నాయక్ బుధవారం ఉదయం తాండాకు వెళ్లి పెళ్లి జరగకుండా అడ్డుకున్నారు. బాలికకు అలాగే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలల రక్షణ విభాగం ఆదేశాల మేరకు తర్వాత చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

'ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి'

నారాయణపేట: నారాయణపేట రూరల్ ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త, జోగిని వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ హాజమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లంపల్లికి చెందిన జోగిని కుటుంబానికి చెందిన నక్క మణెమ్మ , నవనీత కుటుంబ సభ్యులను పెద్ద మనషుల సమక్షంలో రాజీ కుదిర్చి వారం రోజుల్లో సమస్యను పరిష్కరించేలా ఒప్పందం జరిగిందన్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు బాధితురాలి తరఫున నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఎస్‌ఐ తనతో అసభ్యకరంగా మాట్లాడారన్నారు. ఈ క్రమంలో తనతో దురుసుగా ప్రవర్తించిన ఎస్‌ఐపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఎస్పీకి విన్నవించినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఆత్మకూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తప్పవని, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని వ్యవసాయశాఖ ఏడీఏ దామోదర్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని విత్తన, ఫర్టిలైజర్స్ షాపులను వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల నిల్వలు, వాటి కంపెనీలు, గడువు తేదీలు, లైసెన్సు, స్టాక్ రిజిస్టర్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాక అధికారి వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పుస్తకాల పంపిణీ ప్రారంభం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో విద్యార్థులకు అందించేందుకు జిల్లా పాయింట్ నుంచి మండల పాయింట్లకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని డీఈఓ ప్రవీణ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన సమయం ప్రకారం, సకాలంలో అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకం ప్రకటించడం సంతోషకరం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే వారికి రూ.లక్ష ప్రోత్సాహకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం అధ్యక్షులు తెలుగు వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఒక దివ్యాంగులు ఉంటే వర్తించేది కాదన్నారు. ఒక సాధారణ వ్యక్తి ఉండాలనే నిబంధన ఉండేదన్నారు. రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఈ విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం సీఎం గొప్ప నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే వారికి రూ.లక్ష ప్రోత్సాహక జీఓ మంగళవారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ జారీ చేసినట్లు తెలిపారు. దివ్యాంగుల సమస్య పరిష్కారానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి సీతక్క, టీపీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం



ముదుమాల్‌లో జీలుగ పంట సాగు చేస్తున్న రైతు

- మండల వ్యాప్తంగా 38 వేల ఎకరాల్లో పంటల సాగు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు

కృష్ణా: వర్షకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని మండల వ్యాప్తంగా రైతులు పంటల సాగుకు సమయాత్తమవుతున్నారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో భూములను దుక్కి దున్నుకొని విత్తనాల విత్తడానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాస్త్రవేత్తలు రుతుపవనాలు కూడా సకాలంలోనే ప్రవేశిస్తాయని చెప్పడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ఎందుకంటే విత్తనాలను జూన్ మొదటి వారంలో వచ్చే మృగశిర కార్తీలో (మిరుగులో) విత్తుకుంటే పంటలు బాగా పండుతాయని ఈ ప్రాంత రైతుల నమ్మకం. గత సంవత్సరం వర్షాలు ఆలస్యంగా రావడంతో పొలాలను సిద్ధం చేసుకోలేకపోయారు. తద్వారా విత్తనాలను సరైన సమయంలో వేయకపోవడం వల్ల పంటలు దెబ్బతిని అన్నదాతలకు నష్టాలు మిగిల్చాయి. అదే వర్షాలు ముందుగా కురుస్తే సకాలంలో విత్తనాలు విత్తుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాగే దిగుబడి కూడా బాగా వచ్చి లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది.

వ్యవసాయ అధికారుల అవగాహన

వర్షాకాలంలో అన్ని రకాల పంటలు సాగు చేసేందుకు వీలుగా అన్నదాతలు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్నారు. వరి, పత్తి పంటలకు ప్రాధాన్యత ఇస్తూ సాగు కోసం ప్రణాళికలు వేసుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు కూడా విత్తనాల పంపిణీకి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అలాగే గ్రామాలకు వెళ్లి పంటల వివరాలు, భూమి స్వభావం వివరాలను సేకరించి రైతులకు ఏ పంటలు సాగు చేయాలో అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో గత ఏడాది కంటే ఈసారి వరి, పత్తి పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉందని అధికారుల అంచనా. వరి సాధారణ విస్తీర్ణం 12000 ఎకరాలు కాగా, ఈ వర్షాకాలంలో 12,500 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు. అదే విధంగా పత్తి గతంలో 21వేల ఎకరాల్లో సాగు చేయగా ఈసారి పెరగవచ్చని చెబుతున్నారు. కందులు కూడా 100 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని అంటున్నారు. మండలంలో ఈ సంవత్సరం అనుకూలంగా వర్షాలు కురవడంతో పంటలు 10 నుంచి 20 శాతం వరకు సాగు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

రైతులు మోసపోవద్దు



ఉమ్మడి మండలాల్లో మొత్తం12 క్లస్టర్‌లలో వ్యవసాయ విస్తారణ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎరువులు వాడే విధానం, భూసార పరీక్షలు, భూమి స్వభావం తదితర అంశాలను అన్నదాతలకు వివరించేలా చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా రైతులు విత్తనాలను ప్రైవేటు డీలర్ల నుంచి కొనుగోలు చేసి మోసపోకుండా ప్రభుత్వం నిర్దేశించిన దుకాణాల్లో కొనుగోలు చేయాలి.

– సుదర్శన్‌గౌడ్, మండల వ్యవసాయ అధికారి

రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు



మరికల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మక్తల్‌లో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్‌లు

మక్తల్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రధానిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ జెడ్పీ చైర్మన్ లక్ష్మారెడ్డి, గణేశ్, కోళ్ల వెంకటేశ్, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

మరికల్: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరికల్ ఇందిరా గాంధీ చౌరస్తాలో బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హరీష్, కృష్ణయ్య, రామ కృష్ణ, ఆనంద్‌కుమార్, రాజు, రఘుపత్తిరెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

నత్తనడకన మండల కార్యాలయం పనులు



నిర్మాణంలో సమీకృత మండల కార్యాలయం

కొత్తపల్లి: కొత్తపల్లి, గుండుమాల్‌ను ఇటీవల మండలాలుగా ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో రెండు మండలాల్లో పక్కా భవనాల ఏర్పాటుకు ఎమ్మెల్యే చొరవ తీసుకొని రూ.17.60 కోట్లు మంజూరు చేయించారు. నిధులు విడుదలైనప్పటికీ కొత్తపల్లి మండలంలో భవన నిర్మాణ పనులు నేటికీ పునాదులకే పరిమితమయ్యాయి. ఈ విషయమై గుత్తేదారును వివరణ కోరగా ఇసుక కొరత కారణంగా పనులు ఆలస్యమవుతున్నట్లు తెలిపారు. అలాగే వర్షాకాలం మొదలవడంతో పునాది గుంతల్లో నీరు చేరి పనులకు ఆటంకం ఏర్పడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

వనమహోత్సవం విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: వన మహోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం హరితా హారంపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ఊరు–మన పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. ఇంటి పరిసరాల్లో, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కను నాటాలని సూచించారు. ఎవరైన మొక్కలను కాల్చడం, నరకడం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, గణేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కూలి రూ.300 వచ్చే విధంగా చూడండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నర్సింహారెడ్డి

మద్దూరు: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.300 వచ్చే విధంగా వారిచే పనులు చేయించాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి మద్దూరు మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. వర్షకాలం ప్రారంభ కానుండడంతో ఫాంపడ్స్, హార్టికల్చర్ పనులు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏంపీఓ రామన్న, ఏపీఓ నాగరాజు, ఉమ్మడి మద్దూరు మండల టీఏలు, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



క్రీడాకారులను అభినందిస్తున్న సిబ్బంది

నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను ఉపయోగించుకొని క్రీడలలో రాణించి జాతీయ స్థాయిలో సత్తా చాటాలని రాష్ట్ర రిసోర్సు పర్సన్ రతంగ్‌పాండ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఉచిత క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొని భవిష్యత్‌లో రాష్ట్ర , జాతీయ స్థాయిలో సత్తా చాటి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకోరావాలన్నారు. అలాగే క్రీడలలో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా విద్యా శాఖ ఎఎమ్ఓ నాగార్జున రెడ్డి, ఖేలో ఇండియా అథ్లెటిక్ కోచ్ హారిక దేవి, క్రికెట్ కోచ్ అజయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్

అమరచింత: ట్రాక్టర్ డ్రైవర్లు రోడ్డు నిబంధనలను పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసు కుంటామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండ లంలోని పాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్ట ర్ డ్రైవర్లు, యాజమానులకు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాల రిజిస్ట్రేషన్, లైసెన్స్ వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. నిబంధలు అతిక్రమిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు.

సెల్‌పోన్ అప్పగింత...

పట్టణానికి చెందిన గొల్ల రామకృష్ణ సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో.. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి బుధవారం అందించారు.

25న వక్ఫ్ సవరణ చట్టంపై బహిరంగసభ



మాట్లాడుతున్న మౌలానా నయీం కౌసర్ రషాదీ

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 25న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు సభ కన్వీనర్ మౌలానా నయీం కౌసర్ రషాదీ వెల్లడించారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహిరంగసభకు ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవేసీ, ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు అధ్యక్షులు మౌలానా ఖాలెద్ సైఫుల్లా, కర్నాటకకు చెందిన మాజీ కేంద్రమంత్రి సీఎం ఇబ్రహీం , జామియా నిజామియాకు చెందిన ముఫ్తి ఖలీల్ అహ్మద్, కోల్‌కత్తాకు చెందిన మౌలానా అబుతాలిబ్ రహెమాని, జమాలుర్ రహెమాన్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. మహిళలకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఆయా ముస్లిం సంఘాలు, మతపెద్దలు, పార్టీల ప్రతినిధులు అబ్దుల్ హాదీ, ఇంతియాజ్ ఇసాక్, మౌలానా అబ్దుల్లా ఖాన్ హామెద్ పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కొత్తపల్లి: మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. కొత్తపల్లి మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ శివారులో దాడులు నిర్వహించి లారీని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అలాగే వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల తాండాకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాస్, లారీ ఓనర్ దేవ్‌సింగ్ నాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు మద్దూరు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నారాయణపేట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రయాణికులు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లక్కీ డ్రాలో బహుమతులు గెలుపొందారని, ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే వాహనాలు, వస్తువులు దొరుకుతున్నాయని ఫోన్ చేసి చెబితే వాటిని నమ్మొద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే 1930 లేదా డయల్ 100 కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చిన్నచింతకుంటలో తిరంగా ర్యాలీ

చిన్నచింతకుంట: ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా గురువారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో బాల గంగాధర్ తిలక్ యువజన సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా నాయకులు నంబిరాజు, కుర్వ రమేష్‌లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పార్టీలకు అతీతంగా తరలి వచ్చి వీర సైనికులకు సంఘీభావం తెలపాలని కోరారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ



జీలుగ విత్తనాలు అందజేస్తున్న వెంకట్రామారెడ్డి

మరికల్: సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ వెంకట్రామారెడ్డి సూచించారు. మండల కేంద్రానికి వచ్చిన సబ్సిడీ జీలుగ విత్తనాలను బుధవారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అగ్రో రైతు సేవ కేంద్రానికి 250 బస్తాల జీలుగా విత్తనాలు వచ్చాయన్నారు. వీటిని 50 శాతం సబ్సిడీపై 30 కిలోల బస్తాను రూ.2,140కు అందజేస్తున్నట్లు తెలిపారు. పట్టదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొచ్చి విత్తనాలను తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ రహ్మాన్, ఏఈఓ పరుశురామ్, కృష్ణయ్య, ఆనంద్‌కుమార్, విష్ణువర్దన్‌రెడ్డి, రాజు, హరీష్, గోపాల్, హర్షవర్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లారెడ్డి, జయసింహారెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయవాది లక్ష్మీపతి గౌడ్

దామరగిద్ద: న్యాయ పోరాటంలో ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సురేష్‌కుమార్, లక్ష్మీపతి గౌడ్, నాగేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయసేవలు అలాగే వారి హక్కులపై అవగాహన కల్పించారు. చట్టాలు తెలిసినప్పుడే హక్కులను నిర్భయంగా పొందవచ్చన్నారు. అలాగే రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలని, మోసపోయినప్పుడు వాటితో న్యాయ పోరాటం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంజుల, ఏఈఓ శివజ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమృత్ 2.0 పనుల్లో వేగం పెంచాలి



పనులు పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్ రావు

అమరచింత: ఆత్మకూర్, అమరచింత పట్టణాల్లో చేపడుతున్న అమృత్ 2.0 తాగునీటి పనుల నిర్మాణంలో వేగం పెంచి, అనుకున్న సమయంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందించాలని డీఈ శ్రీనివాస్ రావు అన్నారు. పట్టణంలో చేపడుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి రూ.11 కోట్లతో రెండు వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామని వెల్లడించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 6 లక్షల లీటర్లు, దశమి కట్ట సమీపంలో 5 లక్షల లీటర్ల వాటర్‌ట్యాంకులను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు పట్టణంలో 10 కిలో మీటర్ల మేరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి తాగునీరు చేరే విధంగా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈఈ చంద్రశేఖర్, మెగా కంపెనీ మేనేజర్ నరాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

రూ.1.80 కోట్లు మంజూరు

- ఆత్మకూర్, అమరచింతలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఏర్పాట్లు
- స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న శివసేనారెడ్డి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని, క్రీడాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం సాయంత్రం ఆత్మకూర్‌లోని మినీ స్టేడియాన్ని రాష్ట్ర గీత కార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్‌తో కలిసి సందర్శించారు. స్థానిక క్రీడాకారులు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, షటిల్ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అభినందించారు. షటిల్ క్రీడాకారులకు ఉపయోగపడేలా రూ.1.80 కోట్ల నిధులతో షటిల్ ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, నాగేష్, దామోదర్, సాయిరాఘవ, మచ్చేందర్‌గౌడ్, అశోక్, రఫీఖ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

అమరచింత: గ్రామీణ క్రీడాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు పాఠశాల ఆవరణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నిధులు త్వరలోనే విడుదల చేసి, పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు డ్వాక్రా రుణాలను అందిస్తూ వారి కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నామని తెలిపారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఏఐటీయూసీ జెండాను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్మిక హక్కులను కాపాడుకుంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్, అయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు తిరుమలేష్, మహాంకాళి విష్ణు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్, బాలరాజ్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.